క్లుప్తంగా

2న మహా కరుణ ధ్యాన మహాయజ్ఞం



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

సీటీఆర్ఐ: సుభాష్ పత్రీజీ స్ఫూర్తితో వశిష్ట గౌతమి పిరమిడ్ మహాశక్తి క్షేత్రం స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీన విజయ దశమి, గాంధీ జయంతిని పురస్కరించుకుని మహా కరుణ ధ్యాన మహాయజ్ఞం, మెగా శాకా హార సద్భావనా ర్యాలీ నిర్వహించనున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేక రుల సమావేశంలో ర్యాలీ నిర్వాహకుడు దారపు నాగిరెడ్డి మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి అన్ని ఆధ్యాత్మిక సంస్థలతో కలిసి ఈ రెండు భారీ కార్యక్రమాలు తలపెట్టామన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద సంగీత విద్వాంసులతో సంగీత వేణునాద ధ్యానం, 9 గంటలకు శాకాహార సద్భావనా ర్యాలీ, అనంతరం సంగీత ధ్యానం, ప్రముఖ గురువులు, ముఖ్య అతిథులు, సీనియర్ పిర మిడ్ మాస్టర్ల అనుభవాలు, ఆధ్యాత్మిక సం దేశాలు ఉంటాయన్నారు. సుమారు ఐదు వేల మంది వరకు ఈ ర్యాలీలో, ఇతర కార్యక్ర మాల్లో పాల్గొంటారని తెలిపారు. సమావేశం లో చిట్టూరి మూర్తి, పిరమిడ్ హౌస్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తురాలికి వెండి నాణెం బహూకరణ



లక్కీడ్రా విజేతకు వెండి నాణెం అందజేస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం, బత్తులంకి ప్రకాష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కోటిపల్లి బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలను ఆలయ గౌరవాధ్యక్షుడు బత్తులంకి ప్రకాష్ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేప థ్యంలో మంగళవారం అమ్మవారిని ఏపీఐసీసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామ సుబ్ర హ్మణ్యం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజూ కుంకుమ పూజలో పాల్గొనే భక్తులకు లక్కీడ్రా తీసి ఐదు గ్రాముల అమ్మవారి వెండి నాణేలు అందజేస్తున్నారు. ఈ మేరకు లక్కీడ్రాలో గెలుపొందిన భక్తురా లికి శివరామ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అమ్మవారి వెండినాణెం బహూకరించారు. కార్యక్రమంలో బత్తులంకి ప్రకాష్, ఆటో యూని యన్ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్‌గా ఎంపికైన రాంబాబుకు సత్కారం



రాంబాబును సత్కరిస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్ తదితరులు

కడియం: కష్టాలు, కటిక పేదరికాన్ని జయిం చి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించిన మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన బొమ్మాళి రాంబాబును కడియం మండలం జేగురుపాడు గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఘనంగా సత్క రించారు. ఈ మేరకు మంగళవారం రాం బాబు ఇంటికి వెళ్లి వెండి పెన్నును బహూక రించారు. నేటి యువతకు రాంబాబు స్ఫూర్తిగా నిలుస్తాడని స్టాలిన్ అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గంటి స్వామి ప్రసాద్, ఫిషర్‌మన్ సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్ కుమార్, మాజీ అధ్యక్షుడు బళ్ల అన్నవరం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్ పాల్గొన్నారు.

ఆకుల వీర్రాజు పరామర్శ



భాను ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఆకుల వీర్రాజు

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ నాయకుడు పం దెళ్ల భానుప్రసాద్‌ను డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు మంగళవారం పరామర్శిం చారు. భానుప్రసాద్ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకొని, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుం టున్నారు. ఈ నేపథ్యంలో ధవళేశ్వరంలోని భానుప్రసాద్ ఇంటికి ఆకుల వీర్రాజు విచ్చేసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కురుమళ్ల ఆంజనేయులు, ఒంటెద్దు కృష్ణ, ఏజీఆర్ నాయుడు, ముత్యాల జాన్, గూటం రాజు, బాబీ ఉన్నారు.

అద్భుతం.. ఆధ్యాత్మికం..

- ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు
- దసరాను పురస్కరించుకుని ఏర్పాటు
- హిందూ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక



కాతేరు బీసీ కాలనీలోని విజయదుర్గమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

రాజమహేంద్రవరం రూరల్: హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, పండగలు, పురాణాల విశిష్ట తను భావి తరాలకు అందించేందుకు అనేక కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. వాటిలో బొమ్మల కొలువులు ముఖ్యమైనవి. ఇవి ప్రజ లను ఎంతో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా చాలా మంది తమ ఇళ్లల్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తుంటారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, రామాయణ, భారత భాగవతాల్లోని ముఖ్య ఘట్టాలను పిల్లలకు తెలియజేయాలన్నదే వీటి వెనుక దాగి ఉన్న ముఖ్య ఉద్దేశం. పురాణ, ఇతి హాసాల్లోని ముఖ్య ఘట్టాలను కళ్లకు కట్టేలా కాతే రులో బీసీ కాలనీలోని విజయ దుర్గమ్మ ఆలయం లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది.

కళ్లకు కట్టినట్టు..

కాతేరు బీసీ కాలనీలోని విజయదుర్గమ్మ ఆలయం లో భక్తులందరూ సమష్టిగా ఏర్పాటు చేసిన బొ మ్మల కొలువు అబ్బుర పరుస్తోంది. చూడచక్కని బొమ్మలతో రాముడు, కృష్ణుడి జన్మ వృత్తాంతా లను తెలిపేలా బొమ్మలను ప్రదర్శించారు. తొమ్మిది రకాల భక్తి మార్గాల ఘట్టాలను బొమ్మల రూపంలో చక్కగా ప్రదర్శించారు. రామాయణం లోని ముఖ్యఘట్టాలైన పుత్రకామేష్టి యాగం, రాముని జననం, పర్ణశాల, సీతాపహరణం, అహల్యా శాప విమోచనం, జటాయువు, కుంభ కర్ణుని నిద్ర లేపడం, రావణ సంహారం తదితర వాటిని అద్భుతంగా ప్రదర్శించారు. నవదుర్గలు, దశావతారాలు, అష్టలక్ష్మీలు ఇలా ఎన్నో బొమ్మలు కొలువు దీరాయి. ప్రతి బొమ్మ ఒక ఆధ్యాత్మిక సం ఘటను గుర్తుకు తెస్తోంది.

ప్రతి ఏడాదీ నిర్వహిస్తాం



ప్రతి ఏడాదీ కాతేరు బీసీ కాలనీలోని విజ యదుర్గమ్మ ఆలయంలో భక్తులతో కలిసి సమష్టిగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నాం. నేటి తరం పిల్లలకు పురాణాలు, ఆధ్యాత్మిక విషయాలు, మన సంస్కృతిని తెలియజెప్పాలన్నదే దీని ఏర్పాటుకు గల కారణం. శరన్నవరాత్రులలో రోజుకొక కార్య క్రమం చేపడతాం. అందులో ఒక రోజు బొ మ్మల కొలువు ఏర్పాటు చేయడం జరిగింది.

– యానాపు లోవ కుమారి, బీసీ కాలనీ, కాతేరు.

4, 5 తేదీల్లో బ్రెజిల్ ప్రతినిధుల పర్యటన



కలెక్టర్ కీర్తి

సీటీఆర్ఐ: జిల్లాలో అక్టో బర్ 4, 5వ తేదీల్లో బ్రెజిల్ ప్రతినిధులు రెండు బృం దంగా పర్యటి స్తారని, వాటిలో మొత్తం 27 మంది సభ్యులు ఉంటారని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వీరి పర్యటనతో మన ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తుందన్నారు. మొదటి బృందం అక్టోబర్ 4న పెరవలి మండలం ముక్కా మల గ్రామంలో, అక్టోబర్ 5న కొవ్వూరు మండలం కాపవరం, దేవరపల్లి మండలం యర్నగూడెంలో పర్యటిస్తారన్నారు. ఈ బృందానికి సమన్వయ అధికారులుగా జకీర్, మధుమోహన్ వ్యవహరిస్తారని, సాంకేతిక, కమ్యూనికేషన్ విభాగాల సిబ్బంది ఉంటారన్నారు.

- రెండో బృందం అక్టోబర్ 4న కొవ్వూరు మండలం కాపవరం, అక్టోబర్ 5న దేవరప ల్లి మండలం కూరుకురు, పల్లంట్ల, యర్న గూడెం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఈ బృందానికి సమన్వయ అధికారులుగా సుధాకర్, హుమాయూన్ వ్యవహరిస్తారని, అనుబంధ సాంకేతిక బృందం, కమ్యూనికే షన్ విభాగం అధికారులు ఉంటారన్నారు. అన్ని విభాగాల అధికారులు పరస్పర సమ న్వయం చేసుకుని ఈ పర్యటన విజయవం తమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దుర్గాదేవిగా జగన్మాత



ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ మాత



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి



ధవళేశ్వరంలో బాలా త్రిపుర సుందరి అమ్మవారు



మోరంపూడిలో విజయ కనకదుర్గాదేవి

సీటీఆర్ఐ: శ్రీదేవి శరన్నవరాత్రులలో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం దేవీచౌక్‌లో బాలా త్రిపుర సుందరీదేవిని దుర్గామాతగా అలంకరిం చారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలధారణ చేసిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవా రిని దర్శించుకున్నారు. ఉమా మార్కండేయేశ్వర స్వామి దేవాలయంలో స్వయంభూ పార్వతీమా తను దుర్గాదేవిగా అలంకరించారు. ఉదయం కుం కుమ పూజలు నిర్వహించారు.

ధవళేశ్వరం: గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి ఆల యంలో బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దుర్గా దేవిగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని.. కుం కుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చ కులు విస్సు, చిన్నా అమ్మవారికి, అగస్త్యేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయి నగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదు ర్గాదేవి ఆలయంలో అమ్మవారూ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

మెడిసేఫ్
ఎమర్జెన్సీ & మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఆర్యాపురం మెయిన్‌రోడ్, రాజమండ్రి
7399942222, 7399982222
24/7 అత్యవసర కేసులు అన్నివేళలా చూడబడును.

4 నుంచి మానసిక ఆరోగ్య నవోత్సవాలు



పోస్టర్ విడుదల చేస్తున్న పద్మా కమలాకర్ తదితరులు

కంబాలచెరువు: అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకూ మానసిక ఆరోగ్య అవగాహనా నవోత్స వాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం డాక్టర్ సాంబశివారెడ్డి ఆసుపత్రిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పద్మా కమలాకర్ మాట్లాడుతూ ప్రోగ్రెసివ్ సైకాల జిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, లయన్స్ క్లబ్ 320 ఎ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నవోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మందికి పైగా ప్రజలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ప్రతి ఏడుగురిలో ఒకరికి ఈ సమస్య ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌వో) వెల్లడించిందన్నారు. యువతలో ఆత్మహ త్యలకు ప్రధాన కారణం మానసిక సమస్య అన్నారు. మహిళలు చిట్ చాట్, మగవారి మనసు సున్నితం, విద్యార్థుల ఆత్మహత్యలు, చదువు ఒత్తిడి, ఆటలు, మానసిక ఆరోగ్యం తదితర 12 అంశాలపై ఈ నవోత్సవాలలో అవగాహన కార్యక్ర మాలుంటాయన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వీరభద్రం, ఆంధ్ర, తెలంగాణ అధ్యక్షుడు సాగర్ల రఘు డాక్టర్ నివాస్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ పి.రమేష్ కుమార్, అన్నమయ్య జిల్లా అధ్య క్షురాలు ఈ.షాహినా, వుమన్ చైల్డ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సూపర్ వైజర్ డాక్టర్ స్పందన, సైబర్ సెక్యూరిటీ ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'ఆనందో బ్రహ్మ'



స్వర గానం చేస్తున్న సుప్రీం శేఖర్ బాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గాయ కుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భం గా స్థానిక విక్రమ హాలులో ఆనందో బ్రహ్మ పేరిట మంగళవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సుభాష్ పత్రీజీ ఆశీసులతో డాక్టర్ పీఎస్ గోపాలకృష్ణ సారథ్యంలో స్పిరిచ్యువల్ టాబ్లెట్స్, ఆనందో బ్రహ్మ సంయుక్త ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. కొచ్చెర్లకోట బుచ్చిబాబు మిమిక్రీ, ఎం. సుప్రీం శేఖర్ బాలు స్వర గానం, యామిని కసిరెడ్డి కూచిపూడి నృత్యం అలరిం చాయి. కార్యక్రమానికి రోటరీ ఐకాన్ చార్టర్ ప్రెసి డెంట్ తీగల రాజా అతిథిగా హాజరయ్యారు. ఉం దిలే మంచికాలం ముందు ముందునా పాటకు చిన్నారి దీక్షిత నృత్యంతో అలరించింది. రత్న కుమారి తదితరులు వ్యాఖ్యానం చేశారు.

సంపద కన్నా ఆరోగ్యం మిన్న

రంగంపేట: మానవుడికి సంపద కన్నా ఆరోగ్యం మిన్న అని విశ్రాంత ఉపాధ్యాయుడు పుట్టా సోమన్న చౌదరి అన్నారు. మర్రిపూడి గ్రామ సచివా లయం వద్ద మంగళవారం జరిగిన స్వస్థనారీ అభి యాన్ వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ప్రత్యేక ఆరోగ్య పథకం తో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

కన్యలతో గ్రామోత్సవం



కొంకుదురులో గ్రామోత్సవం చేస్తున్న కన్యలు

బిక్కవోలు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా కొం కుదురు గ్రామంలోని గోపాల రామానాయుడు వీధిలో మంగళవారం కన్యలతో గ్రామోత్సవం చేశారు. అర్చకులు రమణశర్మ, భాస్కరశర్మ, శ్రీనివా సశర్మ ఆధ్వర్యంలో 108 మందితో ముందుగా కన్యా రాధన నిర్వహించారు. .

ఎన్‌సీసీతో యువతకు క్రమశిక్షణ



రక్తదానం చేసిన ఎన్‌సీసీ క్యాడెట్లతో ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ

రాజానగరం: యువతకు సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, క్రమశిక్షణతో జీవితాన్ని ఉన్నతంగా మలచుకునేందుకు ఎన్‌సీసీ తోడ్పడుతుందని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో వారం రోజు లుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రే షన్ క్యాంప్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న రక్తదాన కార్యక్రమంతో పాటు ఎన్‌సీసీ క్యాడెట్లతో నిర్వహిస్తున్న వివిధ రకాల ఈవెంట్లను కూడా పరిశీలించారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

రంగంపేట: దసరా సెలవుల్లో విద్యార్థులకు సమగ్ర శిక్షా ద్వారా ఇంటర్న్‌షిప్ శిక్షణ అందిస్తున్నారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ, ఐఏఎస్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ విభాగంలో పది రకాల వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్, ఆటోమో టివ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రానిక్స్ చదు వుతున్న పదో తరగతి విద్యార్థులను మంగళవారం స్థానికంగా ఉన్న ఎలక్ట్రానిక్స్ మరమ్మతు షాపులు, విద్యుత్ సబ్ స్టేషన్లకు తీసుకువెళ్లి, వివిధ అం శాలపై అవగాహన కల్పించారు. ఈ ఒకేషనల్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రధానోపాధ్యాయురాలు దాట్ల అరుణ అన్నారు. తమ పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్ ఎస్.సంజీవ కుమారి పది రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

7న ఫ్యాప్టో పోరుబాట

కంబాలచెరువు: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై అక్టోబర్ 7న విజయవాడలో జరిగే ఫ్యాప్టో పోరుబాట కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని లఆ సంఘ జిల్లా శాఖ కోరింది. రాజ మహేంద్రవరంలోని ఏపీఎన్‌జీవో హోమ్‌లో మంగళ వారం రాత్రి ఫ్యాప్టో సన్నాహక సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ డేనియల్ బాబ్ అధ్యక్షత వహించగా, జిల్లా కో చైర్మ న్, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) జిల్లా అధ్యక్షుడు కె.డేవిడ్ లివింగ్‌స్టన్ హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయడంలో భాగంగా ఫ్యాప్టో పోరుబాట పోస్టర్లు, పాంఫ్లెట్లను ఆవిష్కరించారు. భారీ స్థాయిలో ప్రచార కార్య క్రమాలు, ప్రెస్ మీట్లు నిర్వహించి ఉపాధ్యాయుల్లో ఉత్తేజం తీసుకురావాలని ఫ్యాప్టో నిర్ణయించింది. ప్రచార కార్యక్రమాలు విజయవంతం చేసేదిశగా జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులకు నియోజకవర్గాలు, మండలాల కేటాయింపు జరిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురంలోని సర్వ్ విత్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ ఆరో వార్షికోత్సవం సందర్భంగా మంగళ వారం పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచే ప్రతి సేవా కార్యక్రమం సమాజంలో మార్పు తీసు కొస్తుందన్నారు. నిరు పేదలకు అండగా ఉంటున్న సర్వ్ విత్ హార్ట్ సంస్థను అభినందించారు.

రూ.25 వేల ఆర్థిక సాయం



ప్రదీప్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సాయిబాబా తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్యంతో ఆస్ప త్రిలో చికిత్స పొందుతున్న ఎల్ఐసీ రూరల్ బ్రాంచి ఏజెంట్ ఎం.ప్రదీప్ కుటుంబ సభ్యులకు రూరల్ ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ మంగళవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించింది. ఈ సం దర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా మాట్లాడుతూ ఏజెంట్ ప్రదీప్ అనారో గ్యానికి గురవడంతో వెంటనే వైద్యులతో మాట్లాడి అవసరమైన రక్తం ఏర్పాటు చేశామన్నారు. ఏజెంట్ల సహకారంతో రూ.25 వేలు అందించామన్నారు. డివిజన్ ఉపాధ్యక్షుడు జీకే చంద్రశేఖర్, రూరల్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మట్టా సత్యనారాయణ, కోశాధికారి ఎర్నాగుల రామ్మోహన్, ఈసీ మెంబర్లు కొత్త సత్యనారాయణ, కోన సతీష్ పాల్గొన్నారు.

ఉగ్ర గోదావరి



బొబ్బిల్లంక – ములకల్లంక గ్రామాల మధ్య గోదావరి వరద ఉధృతి

- బొబ్బిల్లంక – ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవాహం
- నదిలో మునిగిపోయిన రహదారి
- బోటుపైనే ములకల్లంకకు ప్రయాణం
- అప్రమత్తమైన అధికారులు

సీతానగరం: అఖండ గోదావరి వరద మంగళ వారం మరింత ఉగ్రరూపం దాల్చింది. మండలం లోని బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో తహసీ ల్దార్ ఎ.శ్రీనివాస్ బొబ్బిల్లంక రేవు వద్ద గోదావరిని పరిశీలించారు. అక్కడ వరద కారణంగా ములక ల్లంక వెళ్లే రోడ్డు మునిగిపోయింది. దీంతో ప్రజలు బోటుపై రాకపోకలు సాగించాలని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అనంతరం ములకల్లంకలో తహసీల్దార్ పర్యటించారు. అక్కడి ప్రజల యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొర్రేడు జిల్లా పరిషత్ హైస్కూల్లో పునరావాసం కేంద్రం ఏర్పాటు చేశా మని, వరద మరింత పెరిగితే అక్కడకు రావాలని స్థానికులను కోరారు. పారిశుద్ధ్యం, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని అక్కడి పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ములకల్లంక, బొబ్బిల్లం కల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. కాగా.. తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ ములకల్లంక వాసులు తమ గ్రామం విడిచి రావడానికి అంగీకరించడం లేదన్నారు. గోదావరి వరద మరింత పెరిగితే వారిని తరలిస్తా మన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.



బొబ్బిల్లంక రేవు నుంచి ములకల్లంకకు బోటుపై వెళుతున్న ప్రయాణికులు



ములకల్లంకలో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్